# అన్నమ్మ నిదానం

శ్రీ కవికొండల వేంకటరావు



ఏరాయిమనువు పద్ధతి వాళ్ల కులంలో వున్నా గానీ ఎంచేతో అన్నమ్మ తనకు ముప్ఫై యేళ్లు దాటిపోతూ వున్నా మళ్లీ పెళ్లి చేసుకోలేదు. పెళ్లి చేసుకున్న మగడు పెళ్లి అయిన ఏడాదిలోనే, అన్నమ్మ పంద్రెండో ఏట పోయినాడు. మఱి కొన్నాళ్లకు ఆమె తల్లీ దండ్రీ కూడా పోయినారు. అన్నమ్మకల్లా తనకు పెళ్లైన సంగతి మాత్రం తెలుసును. మఱి అత్తవారి ఛాయే లేకపోయిందామెకు. ఎంచేతా అంటే అత్తవారి వెంపున ఆస్తీ పాస్తీ మగడు గడించింది ఏమీ లేదు. మగడు పెళ్లినాటికి పాతికేళ్లవాడై కాయ శరీరంతో కనిపిస్తే, బంటాపని చేసుకునో బండి తోలుకునో సంపాదించలేకపోతాడా రోజూ అరణాల డబ్బులని కట్టబెట్టేరు, —అన్నమ్మను వాణ్ణెవణ్ణో అన్నమ్మ తల్లిదండ్రులు. కాని వాడు పైని చెప్పినట్టుగా పెళ్లైన ఏడాదిలోనే తగని జబ్బట్టుకు కాలంచేశేడు.

మొగుడు పోయేటప్పటికి అన్నమ్మ శరీరం అంత ఏపుగానూ లేదు, అంత చూపఱకానందం గొలిపే దానిగానూ లేదు. తల్లిదండ్రులున్నప్పుడుకూడా వాళ్ల చాటునా మాటునా మసలడంచేతనో ఏమో అన్నమ్మ అంటే లోకానికంత లోచనదీప్తంగా తోచనూ లేదు. కాని అంతా పోయి వొక్క అన్నమ్మ తన తలిదండ్రాదుల గుడిసెలో వొక్కర్తీ కాపురం చేస్తూవుండే తలికి, ఎక్కడలేని పేరన్నిక మోసిపోయిందన్నమ్మను. అన్నమ్మవంటి అందమైన ఆడది లేదనే కామాటీ జట్టుగాండ్రంతా చెప్పుకోవడం, ఆమెకేసి ఎగాదిగా చూడ్డం, "మన కులంలో మెఱుపు తీగలాంటి మనిషిరా" అని అనుకుంటూ వుండడం!

వాళ్లనుకుంటూ వుంటారని అనడం కాదు కాని, నిజంగా అందం చెప్పాస్తే అన్నమ్మ అందమే అందం. క్రమంగా ఏళ్లొచ్చిన కొద్దీ అద్దో బులుపు గొలిపే వలంపాటి వళ్లు పెంచేసింది. మాంచి ఎత్తరిమనిషి అయింది. చాయొచ్చింది. నిగారింపూ, నిక్కూ, చొక్కూ, టెక్కూ అన్నీ వేటికవి యేర్పాటుగా తయారయినాయి. మఱి పెళ్లి చేసుకుంటే అదే తరుణం, ఇఖ అప్పట్లో చేసుకోక పోతే మానేయవలసిందే అని అనుకొనేవారు కూడాను ఇరుగుపొరుగు అమ్మగాళ్లు.

అన్నమ్మ వీధుల్లో నడుస్తూ కనబడినప్పు డనుకునే వాళ్లే కాని, ఆడవాళ్లైనా మగవాళ్లైనా, అన్నమ్మ దైనిక జీవితంతో మమైకంగా వుండి మర్మం తెలుసుకొని అన్నమ్మకు సలహాచెప్పేపాళపు సాహసంగలవాళ్లెవళ్లూ లేరు ఆ వూళ్ళో.

ఆ వూళ్ళో మంచినీళ్లు తెచ్చుకోవాలీ అంటే వీధిలో కుళాయికి వెళ్లి తెచ్చుకోవాలి. కూర తెచ్చుకోవాలీ అంటే నడి బజారులో కొట్టుదగ్గఱకు పోవాలి. ఎంతమందికైనా కనబడ్డానికి అవకాశం వుంది ఆమెకు, కాని కనబడ్డవాడల్లా పలకరిస్తాడా? పలకరిస్తేమాత్రం ఒప్పుకుంటుందా? "నేనేం బోగందాన్ననుకున్నావా?" అంటుంది.

ఎందుకూ? ఒకమాటు వేసంగిలో ఇంకా సూర్యుని కిరణాలు మొగాలమీద వ్రాలకుండానే, అందఱి నొసళ్ల మీద, అందఱి కాళ్లమీద, పీలూ సాలూ లేకుండా ఇక్కడేమిటి అక్కడేమిటి మానవశరీరం అన్న ప్రతి స్త్రీ యొక్క ప్రతి పురుషునియొక్క రోమ రోమానికీ వొక చెమ్మటబొట్టు పైకుబికింది. అలాంటి వేళప్పుడు అన్నమ్మ నన్నని తెల్లని మెత్తని చలవచేసిన కంపెనీచీర కట్టుకొని, రయికె సయించలేక, పమిటిచెంగే వీపుమీదుగా కుడి కక్ష క్రిందనుంచి బులబలాగ్గా తీసుకు, పునరావృత్తినదే కుడిబుజానికి విసురుకుని, బిందెతో పొద్దున్నే కుళాయికి నీళ్లకు వెళ్లింది. అప్పుడక్కడ సరిగా శాయన్న అనే ముప్ఫైరెం

ముప్పైఏమూడేళ్ల వాడు కూలిపని చేసుకునేవాడు, బలిష్ఠంగా కుళాయిమూతి చేతగప్పి మఱినొక్కి, ఏటవాలుగా ధారొదిలి, బుస్సున చిమ్మట గొట్టినట్లు నీళ్లు కొడుతూ అన్నమ్మ వచ్చేసరికి సరిగ్గా అన్నమ్మ గుండెలమీదకు అన్నమ్మ ముఖంమీదకు పెట్టి అన్నమ్మను పూర్తిగా నీటితో ముంచెత్తి "బుల్లీ! నీ చెమటెక్కిన వంటికి సేవ చెయ్యాలని బుద్ధి పుట్టింది బుల్లీ! ఏమీ అనుకోకేం" అన్నాడు.

వాళ్లిద్దఱూ ఓ కులంవాళ్లే. చిన్నప్పట్నుంచీ వొకళ్లనొకళ్లు ఎఱుగున్నవాళ్లే. అయితేం—ఆమాత్రం చనుమానంగా అదివఱకు అన్యోన్యం మసిలి ఎఱుగరు.

వాడుచేసిన చేష్టకు ఎంతో కోపం వచ్చేసింది అన్నమ్మకు. ఆ పాళంగా బిందె పుచ్చుకునివాడినెత్తిని మొత్తుదామని అనుకుంది. కాని వాడు పాఱిపోయినాడు. ఎప్పుడైతే వాడు పారి పోయినాడో అన్నమ్మ మఱివానికేసి చూడకుండా లోపల "వెధవ బతుకు! మొగుడులేని బతుకు వెధవబతుకు! ప్రతీవాడికీ ఆశే నేనంటే" నని యనుకొని "అయినా ఏం చేశాడు? పాపం! నాకు చల్లగా వుంటుందని చల్లివుంటాడు ఆనీళ్లు." అని నిలువునా చూచుకుంది. పలాచటి చీర తడిసి ఒంటి నంటుకుపోయి ఇకక్కడ నిలడ్డానికి సిగ్గనిపించింది ఆమెకు. గబగబా బిందెడు నీళ్లూ పట్టుకుని రెండోవాళ్ల కంటబడకుండా ఇంటికి పోయింది.

అప్పట్నుంచీ శాయన్నకని అన్నమ్మ జీవితం యొక్క ప్రతి చిన్న విశేషం తెలుసుకోవాలనే. తెలుసుకున్నకొద్దీ అన్నమ్మను పెళ్లిచేసుకోవాలనే కుతూహలం మఱింత బలకరమౌతూ వచ్చేది. అన్నమ్మకూడా ఆనాటి నుంచీ పనిపాటలు చేసుకునేటప్పుడెలా వెడుతూవచ్చినా ఊళ్లో త్రచ్చాడేటప్పుడు మాత్రం చెంప సరాత్తగుల్చుకుని, పట్టాగొలుసు పెట్టుకుని, దుద్దులమురుచుకుని, గిడసరైకలు తొడుక్కొని, బొద్దంచు చీరలు కట్టుకుని, సంపన్నుల యిండ్లు పనిమనిషా అసలు మనిషా అన్నట్లుండేది.

శాయన్న నవ్వితే అన్నమ్మ కులికేది. శాయన్న ఈలేస్తే అన్నమ్మ వెనక్కి చూసేది. కొందఱు కొందఱు "అన్నమ్మ శకునం మంచిది కాదురా శాయన్నా" అంటే శాయన్న "అదే మంచి"దన్నట్టు ఎదూరుగా వెళ్లతాడు. ఆ ప్రకారంగా వాళ్లిద్దరూ మనసూ మనసూ కలిసిపోయినట్టయింది. కాని తనువూ తనువూ? ఇంకాలేదు.

ఆ ముహూర్త మెప్పుడని అడిగినాడు శాయన్నోన్నా డన్నమ్మను. "ఈయేల కడియంకాడ క్వారీల్లో రాయిమోత వుంది. అక్కడికిపోయొచ్చి సందేల చెప్తాను" అంది అన్నమ్మ. "వుడుకు రోజులు, ఈ వుడుకురోజుల్లో క్వారీ తవ్వు, ఆ తవ్వులో రాయిమోత! ఏమిటిది నీకేం వెర్రెత్తిందా? పిచ్చెత్తిందా?" అన్నాడు శాయన్న; అన్నమ్మ అంది "రోజూ అంతే, ఈపొద్దు నీవు విన్నావు కామోసు" అని.

శాయన్న వెళ్లిపోయినాడు. కాని శాయన్నకు అన్నమ్మమీదనే వుండిపోయింది మతిఅంతా ఆ మధ్యాహ్నం. లేత యెండనే చెమటెక్కిన ముఖం ముదురెండను జెమటెక్కదాఅనుకున్నాడు.ఊళ్ళో చెమటెక్కిన ముఖం క్వారీలమధ్య చెమటెక్కదా అనుకున్నాడు. ఊరికే చెమటెక్కిన ముఖం రాళ్లు మోస్తుంటే చెమటెక్కదా అనుకొన్నాడు.—అనుకొని అనుకొని ఆలాగ్గా బయల్దేరి పదినిమిది మైళ్లు మూడు గంటల్లో, ఎండనకా కొండనకా నడిచిపోయి నడిచిపోయి అన్నమ్మ రాయిమోసే క్వారీల నడానికి జేరుకున్నాడు.

సాయంకాలం నాలుగ్గంటలైంది. ఆనాడు ఈ చెవిగాడు పాచెవికికొడుతూవుంది. అన్నమ్మ కట్టిన చీరఅంతా జేగుర్రంగై, లోపల పుట్టిన చెమట యివతలకు వడపోస్తూ వుంటే, ఎలావుందీ.-పాపం! గుండెల్లో నెత్తురు వడపోతకు వచ్చినట్టుగా వుండిపోయింది. తిన్నని నొసట పోస్తూవున్న చెమట మధ్య మధ్య వేలువంపునే ఊడ్చేసుకుంటూ వుంది. నున్నని పెదవుల్ని పట్టే చెమట నాలుగు వ్రేళ్లా తుడిచేసుకుంటూ వుంది. తట్టలోకి రాళ్లెత్తుకుంటూ ఒక్కొక్కరే ఓమూల, నిలచి కాస్తూవున్న ఎండలో కుతకుత వుడికిపోతూ వుంది.

శాయన్న అన్నమ్మకు దగ్గరగా వెళ్ళేడు. తాను కూడా అలసిపోయేడేమో ఎండపడి, అతి ప్రయాసమీద

న్నాడు "అన్నమ్మా!" అని. అన్నమ్మ ఉలిక్కిపడి వెనక్కుచూచి తన నెత్తి కెత్తుకున్న రాళ్ల తట్ట రాళ్ల గుట్ట మీద మోపి "ఇలా వచ్చావేమిటి అన్నయ్యా!" అంది. శాయన్న చైతన్యహీనుడైపోయేడు. నసుకుతో "బావయ్య వరసెడతావనుకున్నాను" అన్నాడు.

"ఇప్పుడు నివ్వు కనుక ఆపొద్దు కుళాయినీళ్లు చల్లినట్లు తక్షణం నా ముఖమ్మీదకు నీళ్లుకొట్టి యీ చెమట శుభ్రపరిస్తివా నిన్ను పెళ్లాడుతాను" అంది అన్నమ్మ గంభీరంగా.—శాయన్న చుట్టూ చూచేడు. ఎక్కడా వుదకం పురిషెడైనా చిక్కేటట్టు లేదు. అన్నమ్మమీద చల్లడం మాటటుంచి తనగొంతుకతడి చేసుకొందామన్నా గానీ ఎక్కడా గిద్దెడు నీళ్లచుక్కలు కానరావడం లేదు.

సిగ్గుపడిపోయినాడు శాయన్న. తాను చేసిన తొలి తప్పు తెలుసుకున్నాడు: అన్నమ్మ జీవితంలోని నిజమైన కష్టము తాను తొలిగించుట కసమర్థుడనని గ్రహించేడు. "చెల్లీ! రా!" అన్నాడు.

వెంటనే పెద్దవర్షం కురిసింది ప్రళయంగా మేఘం పట్టి. వేసంగిలో అకాలవర్షము యొక్క హాశాత్పతనము, చల్లందనమూ వేఱె చెప్పాలీ! భగవంతుని కృపలో మనమంతా సోదర సోదరీ సమూహం అని కొసరికొసరి పాడినాయి పక్షులు. వాన వెలువడంతో వాళ్లిద్దఱూ సేదదేఱి ఇళ్లకు తిరిగిపోతూ వుంటే—కొసరి కొసరి రాలినాయి చెట్లాకుల నిలిచిపడే చివర చినుకులు.


# ఆనంద ఆంగ్ల భాషాబోధిని

728 పేజీలు

16 నిండు పేజీ చిత్రములు

తెనుగు తెలిసిన మీరు స్వయముగ మూడు మాసములలో ఆంగ్లమును వ్రాయను, చదువను, మాటాడను నేర్చుకొనగలరు.

వ్రాత, ఉచ్చారణ అన్నీ స్వయముగ మీకు సావకాశము గల సమయములందు దినమున కొక గంటవంతున చదువుచు నేర్చుకొన గలరు. ఈ దినములందు ఆంగ్లపరిచయ మవసరము. అవకాశమున్న సమయమున యిటులుండరాదు. ఒక మహాభాష నింత సులభముగ మీకు తెలుపగల 728 పేజీల గ్రంథమేది? ఆనంద ఆంగ్లభాషాబోధిని.

నేడే యీ గ్రంథమును తెప్పించి ప్రారంభించి భాషా పరిచయము కలిగించుకొనుడు.

గ్రంథము వెల 2 రూపాయలు.

పోస్టేజి 8 అణాలు.

ఆనందబోదిని ఆఫీసు,

సావుకారుపేట, మదరాసు.